సాక్షి
మంచిర్యాల
శనివారం ౹ 4 ౹ మార్చి ౹ 2023



'గుర్తింపు' ఎన్నికలకు మరో అడుగు
సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా హైదరాబాద్ రీజియన్ డెప్యూటీ లేబర్ కమిషనర్ శ్రీనివాసులును నియమించారు. 8లో▸



గ్యాస్ ధర పెంపుపై బీఆర్‌ఎస్ నిరసన
వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంపుపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0 /21.0

వాతావరణం
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. ఉత్తరం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మున్సిపల్ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



వేదికపై కలెక్టర్, కమిషనర్, చైర్ పర్సన్

బెల్లంపల్లి: మున్సిపల్ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. శుక్రవారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అధ్యక్షతన 2023–24 వార్షిక అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2022–23 ఆర్థికసంవత్సరం బడ్జెట్‌ను సవరిస్తూ 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌ను రూ.13,84,77,000గా అంచనా వేశారు. వార్షిక బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపాల్టీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించాలని, నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్, మున్సిపల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి ఓఎస్డీ



పనులు పరిశీలిస్తున్న ఓఎస్డీ, అదనపు కలెక్టర్

చెన్నూర్: మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఓఎస్డీ కృష్ణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ఈ నెల 15న ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్న సందర్భంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఓఎస్డీ ఆదేశాలు జారీ చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద గ్రీన్ డెవలప్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం వద్దని, కేసీఆర్ పార్క్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. జంక్షన్ల వద్ద బ్యూటిఫికేషన్ బాగుండాలని సలహాలు, సూచనలు చేశారు. మరో పదిరోజుల్లో పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, ఏఈ సాయికృష్ణ, కౌన్సిలర్లున్నారు.

సాగునీరు అందించాలని కాంగ్రెస్ ఆందోళన



ఆందోళనలో సురేఖ, నాయకులు

మంచిర్యాలటౌన్: దండేపల్లి మండలం గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం రైతులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. రబీ పంటకు సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. సాగునీటి కోసం దీక్ష చేసినా ప్రభుత్వం పట్టించుకోదా? అని ప్రశ్నించారు. అనంతరం పంట పొలాలకు సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌ను కోరారు.

'బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి'



మాట్లాడుతున్న చిన్నయ్య, వేణుగోపాలాచారి

భీమిని: బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి పేర్కొన్నారు. శుక్రవారం కన్నెపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ముత్తాపూర్‌లో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. నాయకునిపేట పంచాయతీ పరిధిలోని మొక్కంపల్లికి రూ.50 లక్షలతో రోడ్డు, బొగుడగూడం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించనున్న మెటల్ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఏసయ్యపల్లి నుంచి లింగాలకు రూ.2.80కోట్లతో రోడ్డు మంజూరైందని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నడిపెల్లి ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాస్‌రావు, ఏఎంసీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, ఎంపీపీ సృజనరావు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగారావు, ఆర్బీఎస్ మండల కన్వీనర్ శ్రీరామారావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజన్న, భారతి, వరప్రసాద్‌రావు, లతాశ్రీ శంకర్, తిరుపతి, లక్ష్మి, అశోక్‌గౌడ్, రాజయ్య, చంద్రయ్య ఉన్నారు.

తునికాకు టెండర్లపై అనాసక్తి!



తునికి చెట్లు

బెల్లంపల్లి డివిజన్‌లోని యూనిట్లు, లక్ష్యం ఇలా..

యూనిట్	స్టాండర్డ్ బ్యాగులు
బెల్లంపల్లి	700
ధర్మారావుపేట	800
నార్వాయిపేట	1,600
తాండూర్	600
కుశ్నపల్లి	1,400
లింగాల	1,600
వేమనపల్లి	3,000
దాంపూర్	1,300
హత్తిని(బీ)	400
నెన్నెల	3,000

- షెడ్యూళ్లు దాఖలు చేయని కాంట్రాక్టర్లు
- చాక్ తరస్ పనులు మరింత ఆలస్యం
- ఏటా తగ్గుతున్న తునికాకు సేకరణ
- బెల్లంపల్లి అటవీ డివిజన్‌లో 10 యూనిట్లు
- 14,400 స్టాండర్డ్ బ్యాగుల సేకరణే లక్ష్యం
- ఉపాధిహామీ పనులవైపే కూలీల మొగ్గు

కట్ట ధర పెంచినా..

అటవీ ప్రాంతానికి వెళ్లి ఆకు సేకరించే కూలీలకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం ఏటా కొంతమొత్తం ధర పెంచుతోంది. 50 ఆకులకో కట్ట కడుతుండగా ఒక్కో కట్టకు 2021లో ప్రభుత్వం రూ.1.80, 2022లో రూ.2.50 చెల్లించింది. గరిష్ఠంగా ఒక్కో కట్టకు రూ.70 పైసలు పెంచి ఆకును కొనుగోలు చేసింది. ప్రస్తుతం తునికాకు కట్ట ధర రూ.3 చేసింది. ఏకంగా ఈసారి రూ.50 పైసలు పెంచి కూలీల్లో ఆశలు కల్పించింది.

టెండర్లు నిర్వహించేలా చర్యలు

టెండర్ షెడ్యూళ్ల వ్యవహారం రాష్ట్రస్థాయిలో ఉంటుంది. ఏటా టెండర్ షెడ్యూళ్లు అమ్ముడుపోయేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్లు షెడ్యూళ్ల కొనుగోలుకు ముందుకురాకపోయినా మళ్లీ టెండర్లు పిలుస్తారు. వారం క్రితం టెండర్లు పిలిచారు. ఖరారు అయ్యాయో.. లేదో.. తెలియదు. మొత్తానికైతే ఆకు సేకరణకు అవరోధం లేకుండా చర్యలుంటాయి.

– వినయ్‌కుమార్ సాహు, ఇన్‌చార్జి ఎఫ్‌డీవో, బెల్లంపల్లి

బెల్లంపల్లి: తునికాకు టెండర్లపై కాంట్రాక్టర్లు అనాసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు టెండర్ షెడ్యూళ్లు కొనుగోలు చేయకపోవడమే అందుకు నిదర్శనం. ఏటా కాంట్రాక్టర్ల ద్వారా ఆకు సేకరించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకు కాంట్రాక్టర్లు యూనిట్ల వారీగా టెండర్ షెడ్యూళ్లను కొనుగోలు చేసి దాఖలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వేసవి సమీపించినా ఇంతవరకు బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో టెండర్ షెడ్యూళ్ల విక్రయాలు జరగనట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా టెండర్ ప్రక్రియ నిర్వహిస్తుండగా ఆ దిశగా కాంట్రాక్టర్ల నుంచి ముందడుగు పడనట్లు సమాచారం. ఇప్పటివరకు రెండుసార్లు టెండర్లు ఆహ్వానించినా కాంట్రాక్టర్ల నుంచి సానుకూల స్పందన రాలేదు. ఆలస్యమైనా టెండర్ షెడ్యూళ్ల అమ్మకాలు జరిగేలా కసరత్తు చేస్తున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా ఏటా డిసెంబర్, జనవరిలో టెండర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఈసారి ఆలస్యం కావడంతో చాక్ తరస్ (కొమ్మ కొట్టే) పనులు మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో 10 యూనిట్లు ఉన్నాయి. అటవీ డివిజన్ వ్యాప్తంగా 14,400 స్టాండర్డ్ బ్యాగుల ఆకుసేకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, ఇప్పటివరకు ఒక్క యూనిట్ టెండర్ షెడ్యూల్‌ను కూడా కాంట్రాక్టర్లు కొనుగోలు చేయనట్లు తెలుస్తోంది. గతేడాది 10 యూనిట్లలో ఏడు యూనిట్ల టెండర్ షెడ్యూళ్లను కొనుగోలు చేసి దాఖలు చేయగా ఈసారి అలాంటి పరిస్థితి కనిపించడంలేదు. మేలో ఆకు సేకరణ చేపడతారు. అప్పటివరకు టెండర్ షెడ్యూళ్లు అమ్ముడుపోయేలా అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

బెల్లంపల్లి అటవీ డివిజన్‌లో..

బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో బెల్లంపల్లి, ధర్మారావుపేట, నార్వాయిపేట, తాండూర్, కుశ్నపల్లి, లింగాల, వేమనపల్లి, దాంపూర్, హత్తిని (బీ), నెన్నెల యూనిట్లు ఉన్నాయి. వీటిలో యూనిట్ల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆకు సేకరణ చేపడతారు. వేసవిలో ఉపాధి పనులు లభించక గ్రామీణులు ఇతరప్రాంతాలకు వలస వెళ్లకుండా ఉండేందుకు, బీడీల తయారీ కోసం అటవీశాఖ తునికాకు సేకరణ చేపడుతోంది. అయితే ఏటా ఆకు సేకరణ ఆశాజనకంగా జరగడం లేదనే విమర్శలున్నాయి. గతంలో మాదిరి ఆకు సేకరణపై అటవీశాఖ చిత్తశుద్ధి చూపడంలేదని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. వేసవిలో గరిష్ఠంగా నెల పాటు ఆకు సేకరణ పనులు జరగాల్సి ఉండగా వారానికి మించి సేకరించడంలేదు. దీంతో గ్రామీణులు ఆకు సేకరణకు ప్రత్యామ్నాయంగా ఉపాధిహామీ పనులకు వెళ్లడానికే ఆసక్తి చూపుతున్నారు.

మహిళల ఆరోగ్యానికి రక్ష



ఆరోగ్య మహిళా క్లినిక్ సేవలు అందించనున్న తాళ్లగురిజాల పీహెచ్‌సీ

- జిల్లాలో నాలుగు ఆరోగ్య మహిళా క్లినిక్‌లు
- ఈ నెల 8న ఆస్పత్రుల్లో సేవలు ప్రారంభం
- ప్రతీ మంగళవారం మహిళలకే వైద్య పరీక్షలు
- ఉచితంగా అన్ని రకాల పరీక్షలు, మందులు



ఎంపికైన జన్నారం పీహెచ్‌సీ

నాలుగు ఆసుపత్రుల్లో ప్రారంభిస్తాం



రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ద్వారా ప్రతీ మంగళవారం మహిళలకు పరీక్షలతోపాటు వైద్య సేవలందించేలా ఆరోగ్య మహిళా క్లినిక్‌లను జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ నెల 8వ తేదీన ప్రారంభిస్తాం. ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్య సేవలు అందిస్తాం. సమస్యలపై వచ్చే మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇస్తాం. ఇందుకు ఆయా మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు హైదరాబాద్‌లో శుక్రవారం శిక్షణ తీసుకున్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలి.

– సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల


మంచిర్యాలటౌన్: మహిళల ఆరోగ్య రక్షణకు ప్రతీవారం వైద్యపరీక్షలు నిర్వహించేలా ఆరోగ్య మహిళా క్లినిక్‌లను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన జిల్లాలో ఎంపిక చేసిన నాలుగు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సేవలు ప్రారంభించనుంది. ఇందుకు బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల పీహెచ్‌సీ, జన్నారం పీహెచ్‌సీ, కుందారం పీహెచ్‌సీ, మంచిర్యాల పట్టణంలోని సాయికుంట బస్తీ దవాఖానాను అధికారులు ఎంపిక చేశారు. ఇకపై ప్రతీ మంగళవారం మహిళలకు మాత్రమే ఆయా ఆసుపత్రుల్లో సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళల్లో ఎక్కువగా వచ్చే ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైనవారికి పూర్తిస్థాయి వైద్యాన్ని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందించేలా చర్యలు తీసుకోనున్నారు.

మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులకు శిక్షణ

జిల్లాలో ఎంపిక చేసిన నాలుగు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతీ మంగళవారం మహిళలకు మాత్రమే వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు ఆయా ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులకు శుక్రవారం హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. బీపీ, షుగర్, రక్తహీనత, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్, మూత్రకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, మెనోపాజ్ దశ సంబంధిత సమస్యలు, నెలసరి సమస్యలు, సెక్స్ సంబంధిత వ్యాధులు, ఇతర సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేస్తారు. బరువు నియంత్రణ, ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. ఇందులో వైద్యం అవసరమైన వారి నుంచి రక్త నమూనాలు సేకరించి ఆసిఫాబాద్‌లోని టీహబ్‌కు టెస్టుల కోసం పంపించనున్నారు. గైనిక్‌కు సంబంధించిన సమస్యలపై సేకరించిన శాంపిళ్లను మంచిర్యాలలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపిస్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో అన్ని రకాల టెస్టులు చేసేందుకు అవసరమైన టీహబ్ ఏర్పాటు చేసేందుకు మరో నెల పట్టే అవకాశం ఉంది. దీని నిర్మాణం పూర్తయితే అన్ని రకాల టెస్టులు ఇక్కడే చేసే అవకాశముంది.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 15నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శైలజతో కలిసి ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 24 పరీక్షా కేంద్రాల ద్వారా జనరల్, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,910 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7,758 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 25 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, 15మంది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతీ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ అధికారులు సరిపడా బస్సులు నడిపించాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, హెల్త్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా పత్రాలను డీఆర్‌డీసీ సెంటర్‌కు తరలింపు ప్రక్రియ పోస్టల్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. టెలికాం, బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు అంతరాయం లేకుండా హైస్పీడ్ ఇంటర్నెట్ సరఫరా చేయాలన్నారు. కేంద్రాల వద్ద మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్యారోగ్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ ధర పెంపుపై నిరసనలు



మంచిర్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- బెల్లంపల్లిలో ఎమ్మెల్యే చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణుల నిరసన
- జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో రాస్తారోకో చేసిన పార్టీ నాయకులు



బెల్లంపల్లి: నిరసనలో ఎమ్మెల్యే, పార్టీ నాయకులు

బెల్లంపల్లి: వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, కార్మికులు కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి బడా పెట్టుబడిదారులపై ఉన్న ప్రేమ పేదలపై లేదని విమర్శించారు. ప్రతీ మూడు నెలలకోసారి గ్యాస్ ధర పెంచుతూ కేంద్రం పేదలపై పెనుభారాన్ని మోపుతోందని ఆరోపించారు. వెంటనే పెంచిన ధరను తగ్గించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఐడీసీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నిరంజన్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బీ నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ విజయ్, అధికార ప్రతినిధి యాదగిరి, ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో రాస్తారోకో

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కట్టెల పొయ్యి, సిలిండర్లు ప్రదర్శిస్తూ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన వంటగ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడిశెట్టి వసుంధర, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, టీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు పల్లపు తిరుపతి, మహిళా అధ్యక్షురాలు గరిగంటి సరోజ, అత్తి సరోజ, తోట తిరుపతి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకునేది కాంగ్రెస్సే..

- బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కష్టాలే..
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- మంచిర్యాల ఆస్పత్రిలో రైతులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేత



రైతుకు నిమ్మరసం ఇస్తున్న భట్టి విక్రమార్క

మంచిర్యాలటౌన్: రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దండేపల్లి మండలం గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా కడెం ప్రాజెక్ట్ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నాలుగురోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులను గురువారం సాయంత్రం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కాగా, భట్టి శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న 13 మంది రైతులు, కాంగ్రెస్ నాయకులను కలిశారు. వారికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 30వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని గూడెం ఎత్తిపోతల పథకాన్ని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కాగా, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక నాసిరకం పనులు చేపట్టడంతోనే పైపులు పగిలి సాగునీరు అందడం లేదని, రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. మూడు టీఎంసీలను రెండు మోటార్ల ద్వారా ఇవ్వాల్సి ఉండగా, మోటార్లు పాడై, పైపులు పగిలితే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. సాగునీటికి రైతులు పోరాటం చేస్తుంటే బీఆర్‌ఎస్ నేతలెవ్వరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పోరాటం చేస్తుందని చెప్పారు. కడెం కెనాల్ 30, 42 కాలువల ద్వారా 30 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు.

రైతువేదికలకు నీటి కటకట



దండేపల్లి మండలం ద్వారక రైతువేదిక



రైతువేదిక వద్ద మిషన్ భగీరథ నల్లా

- భగీరథ నల్లా వచ్చినప్పుడే నీళ్లు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ప్రహరీలు లేక భద్రత కరువు

దండేపల్లి: పంటలసాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం రైతువేదికలు నిర్మించింది. ప్రతీ వ్యవసాయ క్లస్టర్‌కు ఒకటి చొప్పున జిల్లాలో 55 నిర్మించి వాటిలో ఏఈవోలను అందుబాటులో ఉంచింది. ఇందుకు ఒక్కోదానికి రూ.22లక్షలు వెచ్చించింది. మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించి ప్లాస్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేసింది. ఇంత చేసిన ప్రభుత్వం రైతువేదికల వద్ద నీటి వసతి మాత్రం భగీరథ కనెక్షన్‌తోనే సరిపెట్టింది. మిషన్ భగీరథ నల్లా ఎప్పుడు వస్తుందో తెలియదు. వచ్చినపుడు అవి ట్యాంక్‌లోకి ఎక్కే ఆస్కారం లేదు. చాలా చోట్ల మిషన్ భగీరథ నల్లాలు పని చేయడంలేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలోని రైతువేదికల చుట్టూ ఎక్కడా ప్రహరీలు నిర్మించలేదు. దీంతో వాటి భద్రత అంతంతమాత్రంగానే ఉంది. దీంతో రైతులు, అధికారులకు ఇక్కట్లు తప్పడంలేదు. రైతువేదికల వద్ద ప్రత్యేక నీటి సౌకర్యంతోపాటు చుట్టూ ప్రహరీలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

అన్నింటికీ భగీరథ కనెక్షనే..

జిల్లాలో నిర్మించిన రైతువేదికలకు ఎక్కడా ప్రత్యేక నీటి సౌకర్యం లేదు. అన్నింటికీ మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. రైతువేదికలకు కేటాయించిన నిధులు నిర్మాణాలకే సరిపోయాయి. బోర్‌వెల్, ప్రహరీలకు నిధులు కేటాయించలేదు.

– ప్రకాశ్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న సంధ్యారాణి

లక్సెట్టిపేట: పదో తరగతి విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయ ప్రత్యేకాధికారి సంధ్యారాణి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. డీటీడీవో నీలిమ, ఏటీడీవో చిరంజీవి, పీడీ జీవరత్నం, హెచ్‌ఎం గఫార్, హెచ్‌డబ్ల్యూవో శోభారాణి ఉన్నారు.

క్లుప్తంగా

ఆర్కే 6 గనిని సందర్శించిన ఆదిలాబాద్ జడ్జి



గనిపై అధికారులతో జడ్జి ప్రమీల జైన్

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఆదిలాబాద్ సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల జైన్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆర్కే 6 గనిని సందర్శించారు. గనిలోకి దిగి పని స్థలాలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బెల్లంపల్లి రీజియన్ లా ఆఫీసర్ ప్రభందిత, ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి, సేఫ్టీ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, పిట్ ఇంజినీర్ శ్యాంకుమార్, సంక్షేమాధికారి సునీల్‌కుమార్ ఉన్నారు.

ఉగాది పురస్కారానికి ఎంపిక

మంచిర్యాలఅర్బన్: కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 19న అందజేయనున్న శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారానికి మంచిర్యాలకు చెందిన కవి, రచయిత శ్రీనాథ్‌గౌడ్ ఎంపికైనట్లు సమాఖ్య చైర్మన్ మల్యాద్రి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది ప్రముఖ సాహితీవేత్తలు, కవులు రచయితలను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 28 సంవత్సరాలుగా సాహితీరంగంలో కృషి చేస్తూ తెలుగు భాషలో 24 గ్రంథాలు రచించినందుకుగానూ శ్రీనాథ్‌గౌడ్‌ను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలని ఆందోళన


రైతులకు నచ్చజెప్తున్న ఎస్సై వెంకటేశ్

భీమిని(బెల్లంపల్లి): ధాన్యం విక్రయించిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండు నెలల క్రితం తాండూర్ మండలానికి చెందిన నల్ల రమేశ్, వెంకటాపూర్ గ్రామానికి చెందిన సుంకరి మహేశ్ ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువగా ఇస్తామని వెంకటాపూర్, సుర్జాపూర్, కన్నెపల్లి గ్రామాలకు చెందిన 28 మంది రైతుల వద్ద నుంచి సుమారు 500 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసారన్నారు. నెలరోజులకే డబ్బులు ఇస్తామని చెప్పి ధాన్యం కొనుగోలు చేసారని, రెండు నెలలు గడిచినా ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినప్పటికీ న్యాయం జరగకపోవడంతో రోడ్డుపై బైఠాయించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

అటవీ హక్కులను నిర్వీర్యం చేసే చట్టాలు ఉపసంహరించుకోవాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వెంకట్రామయ్య

సిర్పూర్(టి): అటవీ హక్కులను నిర్వీర్యం చేసే చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వేములపల్లి వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 5న కాగజ్‌నగర్‌లోని బంధన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న సదస్సు కరపత్రాలను శుక్రవారం పుసుగూడలో ఆవిష్కరించారు. సోయం చిన్నయ్య, ఎండీ చాంద్‌పాషా, ఆర్.పోషన్న, ఆత్రం పోచన్న, ఆత్రం దేవ్‌రావు, మడావి భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

‘గుర్తింపు’ ఎన్నికలకు మరో అడుగు

- రిటర్నింగ్ అధికారిగా శ్రీనివాసులు నియామకం
- 13న కార్మిక సంఘాలతో సమావేశం
- ఏప్రిల్‌లో నోటిఫికేషన్?
- మేలో ఎన్నికలు?
- సింగరేణిలో మొదలైన ఎన్నికల వేడి



శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియకు మరో అడుగు ముందుకు పడింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా హైదరాబాద్ రీజియన్ డెప్యుటీ లేబర్ కమిషనర్‌గా ఉన్న శ్రీనివాసులును నియమిస్తూ రెండురోజుల క్రితం సెంట్రల్ చీఫ్ లేబర్ కమిషనర్(ఢిల్లీ) ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగానే రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఈ నెల 13న ఎన్నికలపై నిర్వహించనున్న సమావేశానికి రావాలని గురువారం కార్మిక సంఘాలకు లేఖ రాశారు. మొత్తం 30 రిజిస్టర్ కార్మిక సంఘాలకు ఈ లేఖలు అందినట్లు తెలిసింది. గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా జరిగే ఈ మొదటి సమావేశానికి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే పలు కార్మిక సంఘాల సభ్యత్వ వివరాలు తీసుకున్న కమిషనర్ ఈ సమావేశంలో కోడ్ ఆఫ్ డిసిప్లేన్, ఎన్నికల నిర్వహణ, షెడ్యూల్‌పై కార్మిక సంఘాల నేతల అభిప్రాయాలు తీసుకోనున్నారు. లేబర్ డిపార్టుమెంట్‌కు ప్రతి సంవత్సరం అందజేసే వార్షిక నివేదిక, రికార్డులను రిటర్నింగ్ అధికారి పరిశీలిస్తారు.

హైకోర్టు ఆదేశాలతో కదలిక..

సింగరేణిలో ఆరోదఫా గుర్తింపు సంఘం ఎన్నికలు 2017 అక్టోబర్ 5న జరిగాయి. ఈ ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా టీబీజీకేఎస్ విజయం సాధించింది. అప్పటి ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తింపు సంఘం కాలపరిమితి రెండేళ్లే. 2019 నుంచి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని అన్ని ప్రతిపక్ష కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. మధ్యలో కరోనా రావడంతో కంపెనీ దీన్ని సాకుగా చూపి ఎన్నికలకు వెళ్లకుండా జాప్యం చేసింది. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత ఏడాదికాలంగా కార్మిక సంఘాలన్నీ ఎన్నికలు నిర్వహించాలని సెంట్రల్ లేబర్ కమిషనర్, డెప్యుటీ లేబర్ కమిషనర్, సింగరేణి యాజమాన్యాన్ని కలిసి విన్నవించాయి. 2022 మార్చిలో కంపెనీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాల్సి ఉందని, ఎన్నికలకు సమయం కావాలని కోరింది. దీనిపై ఏఐటీయూసీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి రెండేళ్లు దాటినా ఎన్నికలు నిర్వహించడంలేదని, వెంటనే నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన హైకోర్టు ఎన్నికలు నిర్వహించాలని కంపెనీ, సీఎల్సీ, ప్రభుత్వానికి 2022 అక్టోబర్ 28న ఆదేశాలు జారీ చేసింది. దీంతో అప్పటి నుంచి కదలిక మొదలైంది. తాజాగా కంపెనీ కూడా ఎన్నికల నిర్వహణకు సానుకూలత వ్యక్తం చేస్తూ సీఎల్సీకి లేఖ రాయడం, సీఎల్సీ ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించిన మొదటి సమావేశం తేదీ ఖరారు కావడంతో కార్మిక సంఘాల నేతలు ఎన్నికల రణంకు సిద్ధమవుతున్నారు.

ఏప్రిల్‌లో నోటిఫికేషన్?

సింగరేణిలో వార్షిక బొగ్గు ఉత్పత్తి ముగింపు మాసమైన మార్చిలో ఎన్నికలకు నోటిఫికేషన్ ఇస్తే బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల ఏప్రిల్‌లో నోటిఫికేషన్ ఇవ్వాలని కంపెనీ ఈ సమావేశంలో నేతలను కోరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీనికి కార్మిక సంఘాలు కూడా కొంత సుముఖత వ్యక్తం చేసే అవకాశం ఉంది. దీని ప్రకారం రిటర్నింగ్ అధికారి ఏప్రిల్‌లో నోటిఫికేషన్ జారీ చేయనున్నా రు. నోటిఫికేషన్ తేదీ నుంచి నిర్ణీత 45 రోజుల తర్వాత అంటే మేలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

మా పోరాట ఫలితమే ..



మా పోరాట ఫలితంగానే ఎన్నికల ప్రక్రియ మొదలైంది. తాము కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. దీనిపై కూడా జాప్యం చేయడంతో లేబర్ కమిషనర్, సింగరేణి భవన్ ఎదుట ధర్నా చేసి ఒత్తిడి తెచ్చాం.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

ఇంకా జాప్యం చేయవద్దు



సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు ఇప్పటికే చాలా జాప్యం జరిగింది. నిబంధనల ప్రకారం రెండేళ్ల క్రితమే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికైనా జాప్యం చేయకుండా వెంటనే సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలి.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి

వేజ్‌బోర్డు వెంటనే అమలు చేయాలి

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): బొగ్గు గని కార్మికులకు 11వ వేజ్‌బోర్డు వెంటనే అమలు చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేజ్‌బోర్డు కాలపరిమితి ముగిసి 20 నెలలు దాటినా అలవెన్సులపై చర్చించకుండా కేవలం మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19 శాతానికి ఒప్పుకున్న జాతీయ సంఘాలు మరింత కాలయాపన చేస్తున్నాయన్నారు. వెంటనే అలవెన్సులపై చర్చించి మార్చి నెల వేతనంతో 11వ వేజ్‌బోర్డు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ సంఘాలు కార్మికులకు రావాల్సిన పెన్షన్, మెడికల్ కార్డులు, వేతన ఒప్పందం విషయంలో తప్పుడు ఒప్పందాలు చేసుకుని కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా 15 మంది కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, చర్చల ప్రతినిధి మంగీలాల్, జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రవీందర్, సమ్మయ్య, మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, నాయకులు వెంకటేశం, వెంకటేశ్, నారాయణ, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణకు యత్నిస్తున్నారని ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

నస్పూర్(మంచిర్యాల): నస్పూర్ శివారులోని సర్వే నంబరు 42లో ఉన్న తన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ బాధితుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగాడు. బాధితుడు మహమ్మద్ అజాం తెలిపిన వివరాల ప్రకారం సర్వేనంబర్ 42లో తనకు తాతల నుంచి వారసత్వంగా వచ్చిన రెండెకరాల భూమి 2004లో తనపేరుమీద రిజిస్ట్రేషన్ అయ్యిందన్నారు. గురువారం అట్టిభూమిని కొందరు వ్యక్తులు చదునుచేసి ఆక్రమణకు యత్నించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. కాగా కొద్దిరోజుల క్రితం నస్పూర్‌కు చెందిన కొందరు రైతులు టీఎన్జీవోలకు కేటాయించిన భూమి తమదంటూ టెంటు వేసుకుని సుమారు 13 రోజుల పాటు ఆందోళన చేపట్టారు. టీఎన్జీవోలకు, రైతులకు రాజీ కుదరడంతో ఆందోళన విరమించారు. సదరు రైతులు అజాం భూమిని చదును చేస్తుండడంతో మరో వివాదానికి దారి తీసింది.

బాధితుడికి టీఎన్జీవో నాయకుడి ఫోన్

బాధితుడు విలేకరులతో మాట్లాడుతుండగానే టీఎన్జీవో నాయకుడు శ్రీహరి ఫోన్ చేసి ఆందోళన విరమించి మా కార్యాలయానికి వస్తే చర్చిద్దామన్నాడు. గతంలో మధ్యవర్తిత్వం వహించిన గోపాల్‌రావును వెంట తీసుకుని వచ్చినా సరే లేదంటే మేమే నీవద్దకు వస్తామన్నాడు.

విస్తృతంగా రవాణాశాఖ నోటీసుల జారీ


నోటీసులు సిద్ధం చేస్తున్న డీటీవో, సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా త్రైమాసిక పన్నులు చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహన యజమానులకు రవాణాశాఖ నోటీసులు జారీ చేస్తోంది. ఈ నెల చివరిలోగా వందశాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ పేరిట వాహనాల తనిఖీ చేపడుతున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పన్నులు చెల్లించాలని వాహన యజమానుల ఇంటి వద్దనే నోటీసులు అందజేస్తున్నారు. పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాహనదారులకు నాలుగు రోజులుగా నోటీసులు ఇంటికే పోస్టు చేస్తున్నారు. నోటీసులు అందుకున్న వెంటనే పన్నులు చెల్లించకుంటే వాహన తనిఖీల్లో పట్టుబడితే 200–300శాతం అధికంగా జరిమానా చెల్లించాల్సి వస్తుందని అందులో హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 31లోగా రూ.55.86 కోట్ల లక్ష్యం కాగా, రూ.53 కోట్ల వ రకు వసూలు చేశారు. మిగతా మరో రూ. మూడు కోట్ల పన్నులు వసూలు చేసి అవసరమైతే 110 శాతానికిపైగా వసూలు చేస్తామంటున్నారు. త్రైమాసిక పన్నులు, జీవితకాల పన్నులు, వివిధ రకాల ఫీజులు, సర్వీస్ చార్జీలు, వాహనాలకు జరిమానాలు, అధిక లోడ్, పత్రాలు లేకుండా వాహనాలు నడపడం, పొల్యూషన్, ఇన్‌స్రూ?న్స్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తిరిగే వాహనాలకు జరిమానా తదితర రూపాల్లో రవాణాశాఖ అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు.

అడవుల సంరక్షణలో అధికారుల పాత్ర కీలకం


పక్షులు, వన్యప్రాణులను తిలకిస్తున్న విద్యార్థులు

సిర్పూర్(టి): అడవుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర ఎంతో కీలకమైందని డీఈవో అశోక్ అన్నారు. జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో ‘ప్రకృతిలోకి వెళ్దాం’ అనే కార్యక్రమం కింద జిల్లాలో ఎంపికైన 50 మంది విద్యార్థులు శుక్రవారం సిర్పూర్(టి) మండలం వేంపల్లిలోని ప్రకృతి పార్కును సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ క్షేత్ర పర్యటనలు విద్యార్థుల్లో అనుభవాన్ని పెంచుతాయన్నారు. అనంతరం జాతీయ హరిత దళం రీజనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మొదటి రోజు వేంపల్లి హరిత పార్క్‌లోని నర్సరీలోని వివిధ రకాల మొక్కల గురించి ఫారెస్ట్ రేంజ్ అధికారి వేణుగోపాల్, సెక్షన్ అధికారి పోచయ్య, బీట్ అధికారి విజయ్ వివరించారు. వన్యపాణి సంరక్షణ దినం సందర్భంగా అటవీ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి, ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ కటుకం మధుకర్, ఎంఈవో భిక్షపతి, ఎఫ్ఎల్ మోడల్ అధికారి చిలుకూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా పశువుల కాపరి మృతి

భీమారం(చెన్నూర్): అనుమానాస్పదస్థితిలో పశువుల కాపరి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జిల్లా భీమారం మండలం కొత్తగూడెంకు చెందిన కోలకాని రోశయ్య (60) పశువుల కాపరిగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజు మాదిరిగానే గురువారం పశువులను తోలుకుని గొల్లవాగు ప్రాజెక్టువైపు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో మృతుని కుటుంబసభ్యులు ప్రాజెక్టు పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారుజామున ప్రాజెక్టువద్దకు వెళ్లగా మృతదేహం నీటిపై తేలి యాడుతూ కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించా రు. తన భర్తను ఎవరైనా హత్యచేసి ఉంటారని అనుమానంగా ఉందని మృతుని భార్య లక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

వ్యక్తి మృతికి కారకుడికి రెండునెలల జైలు

దండేపల్లి(మంచిర్యాల): ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడిపి ఒకరి మృతికి కారకుడైన వ్యక్తికి కోర్టు రెండు నెలల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. మండలంలోని చింతపల్లికి చెందిన ఎంబడి శంకరయ్య 2017 సెప్టెంబర్ 17న బైక్‌పై వెళ్తూ ఇదే మండలంలోని కొళ్లెపల్లికి చెందిన బొక్కనపెల్లి సాయికుమార్‌ను ఢీకొట్టాడు. ఘటనలో సాయికుమార్ మృతి చెందాడు. దీంతో శంకరయ్యపై దండేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా రిమాండ్‌కు తరలించారు. విచారణ పూర్తికావడంతో లక్సెట్టిపేట కోర్టు జడ్జి మహమ్మద్ అసదుల్లాషరీఫ్ శుక్రవారం జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

డ్రోన్ నిఘాతో మరింత రక్షణ


ఓసీపీ క్వారీ వద్ద సుప్రియో చక్రవర్తి

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులను డ్రోన్‌లతో పర్యవేక్షించడం ద్వారా మరింత రక్షణ చర్యలను పర్యవేక్షించే అవకాశం ఉందని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీఎంఎస్) అధికారి సుప్రియో చక్రవర్తి తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. క్వారీలో జరిగిన బ్లాస్టింగ్‌ను డ్రోన్ల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల వల్ల క్వారీలో జరిగే మైనింగ్ ఆపరేషన్స్‌ను అక్కడి వరకు వెళ్లకుండా పరిశీలించే వీలుందన్నారు. ముందుందు వీటిని మరింత ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్‌లు వెంకన్న, ప్రేంకుమార్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, ఓసీపీ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ సుధీర్, సర్వే అధికారి సంపత్, బ్లాస్టింగ్ ఇన్‌చార్జి కమ్రుద్దీన్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

- ఇసుక టిప్పర్ కిందపడి వ్యక్తి మృతి


మహేశ్ మృతదేహం

భీమారం(చెన్నూర్): అతివేగం ఒక నిండుప్రాణాన్ని బలిగొంది. ముందునుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఇసుక టిప్పర్ కిందపడి మృతి చెందిన సంఘటన మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై గట్ల సుధాకర్ తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన సూరం మహేశ్ (30) ద్విచక్ర వాహనంపై చెన్నూర్ మండలం ఎల్లక్కపేటలోని తన అత్తగారింటికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై కుందారం ఎక్స్ రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టి దాని ముందునుంచి వెళ్తున్న ఇసుక టిప్పర్ కిందపడ్డాడు. దీంతో టిప్పర్ టైర్లు అతని మీదనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పల్సర్ బైక్ పై వెళ్తున్న దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. అతివేగమే ప్రమాదానికి కారణమని ఎస్సై పేర్కొన్నారు. టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దహెగాం(సిర్పూర్): మండలంలోని పార్వతిపేట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్న రాంటెంకి ఈశ్వర్ (కోత్మీర్), గోమాస శ్రీనివాస్ (అయినం), బొడ్డు తిరుపతి(చిన్న అయినం), కోల లచ్చయ్య (దేవాజీగూడ), ఎండీ షబ్బీర్ (బీబ్రా), నానాజీ (అయినం)లను అరెస్టుచేసి వారి వద్దనుంచి రూ.15,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కౌటాల(సిర్పూర్): నాగేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గిన్నెలహెట్టిలో శుక్రవారం గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. పది లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులకు నాటుసారా నిషేధంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ నిహారిక ఆధ్వర్యంలో గ్రామంలో మద్యం నిషేధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇకనుంచీ గ్రామంలో గుడుంబా తయారు చేయమని పోలీసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్, గ్రామ పెద్దలు జ్యోతిరావ్, మల్లేశ్, చంద్రయ్య, గణపతి, సిద్దయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న బయ్య మొగిలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గోలేటి బ్రాంచి గౌరవ అధ్యక్షుడు బయ్య మొగిలి అన్నారు. శుక్రవారం కైరిగూడ ఓసీపీలో కాంట్రాక్టు కార్మికులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలిండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలోనూ అమలు చేయాలని, లాభాల బోనస్, లీవులు, కార్పొరేట్ వైద్యసదుపాయం, ఓసీపీలో 100 శాతం స్థానికులకే ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న భూపాలపల్లిలో జరుగనున్న యూనియన్ మహాసభలకు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి మారం శ్రీనివాస్, పిట్ కార్యదర్శులు జూపాక రాజేశ్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


ఐకే1ఏ గనిపై మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

జైపూర్(చెన్నూర్): భూపాలపల్లి ఏరియాలో డిస్మిస్ చేసిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని హెచ్ఎమ్మెస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందారం ఐకే1ఏ, ఐకే–ఓసీపీ గనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏరియాలో పనిచేస్తున్న మైనింగ్ సర్దార్, 47మంది కార్మికులను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికుల పక్షాన ఉండాల్సిన గుర్తింపు సంఘాలు సంస్థ యాజమాన్యం పక్కన చేరి కార్మికులకు ద్రోహం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి, జక్కుల నారాయణ, దుర్గం లక్ష్మణ్, కంబాల నర్సయ్య, ఎస్‌కే.వలీ, పెద్దన్న, సురేశ్, శ్రీను, సురేశ్, మహేశ్, దుర్గాప్రసాద్, రంజిత్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఓసీపీల్లో స్థానికులకే 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న కంపెనీ క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఇప్పకాయల లింగయ్య, సంజీవ్, హరిరామకృష్ణ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి


మాట్లాడుతున్న పల్లె గంగారెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని పద్మావతి గార్డెన్స్‌లో అసెంబ్లీ బూత్ స్వశక్తి కిరణ్ అభియాన్ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతీ కార్యకర్త ఇప్పటినుంచే పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలన్నారు. బూత్ పరిధిలో ఇంటింటా తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు జోగుల శ్రీదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు


పంట దిగుబడులతో శాస్త్రవేత్తలు, రైతులు

జైపూర్(చెన్నూర్): యాసంగి సీజన్‌లో వరికి బదులుగా ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారిస్తే అధిక లాభాలు పొందవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌నాయక్ అన్నారు. శుక్రవారం జైపూర్ మండలం గోదారిపల్లిలో సామూహిక క్షేత్ర పదర్శనలో భాగంగా అందించిన వేరుశనగ రకం కదిరి లేపాక్షి సాగు చేసిన రైతులతో మాట్లాడారు. చీడపీడలను తట్టుకుని పెట్టుబడులను తగ్గించిందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పన మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడినిచ్చే నూనె గింజల రకాలను సాగు చేయడం ద్వారా ఆదాయం రెట్టింపు చేసుకోవచ్చన్నారు. అంతేగాక శాస్త్రవేత్తల సూచనలు పాటించడం ద్వారా పెట్టుబడి తగ్గించుకుని అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఏడీఏ బాపు, శాస్త్రవేత్తలు నాగరాజు, సతీశ్, జైపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్, ఏఈవో సువర్ణ, సర్పంచ్ సారయ్య, రైతులు పాల్గొన్నారు.

రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తు తెలియని రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం తక్కళ్లపల్లికి చెందిన తన్నీరు అశోక్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయటకు వెళ్లిన అశోక్ తక్కళ్లపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతుని కుమారుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ కారణంగానే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక మరేదైనా కారణమా? అనేది దర్యాప్తులో తేలనుందన్నారు.